## 125. ప్రమాదకర గుణం

మనిషి చేత రకరకాల పాపాలని చేయించే అరిషడ్వర్గాల అధిదేవతలు ఓ సారి అందుకు తాము వుపయోగించే పరికరాలని అమ్మకానికి పెట్టారు.

ద్వేషానికి వుపయోగించే ఆయుధాలు, అబద్ధంతో మాట్లాడే నాలిక, అసూయతో చూసే కళ్ళు, గర్వం పొంగిపొరలే తల, లోభాన్ని పోషించే మనసు... ఇలా. వాటన్నిటికన్నా ఓ తాళంచెవి ధర అధికంగా వుండటంతో ఒకరు ఆ అధిదేవతని అడిగారు.

"ఇది దేనికి వుపయోగిస్తారు?"

"మనిషిని నిరుత్సాహపరచడానికి."

"ఇది ఎందుకంత ఖరీదు?"

"ఎందుకంటే దీనికి మిగిలిన వాటన్నిటికన్నా విలువ అధికం కాబట్టి. దీంతో నేను ఓ మనిషి హృదయాన్ని అతనికి తెలీకుండా తెరచి, లోపలకి ప్రవేశించగలను. ఓ సారి నేను అక్కడ స్థానం సంపాదించాక నేనతన్ని నా ఇష్టం వచ్చినట్లు కృంగదీసి ఆడించగలను. ఉత్సాహం లేని మనిషి మరణించినవాడితో సమానం." దాని అధిదేవత గర్వంగా చెప్పింది.

నిరుత్సాహం, ఉదాసీనత అనేవి లౌకికంగానే కాక, ఆధ్యాత్మికంగా కూడా ప్రగతికి అడ్డుపడుతాయి.

## 126. చెప్పినా తెలియనిది

కొందరు లావో జు శిష్యులు ఆయన చెప్పిన మాటల గురించి చర్చించుకుంటున్నారు. ఆ మాటలు...

'తెలిసిన వాడు చెప్పడు.

చెప్పిన వాడికి తెలీదు.'

కాసేపటికి తమ గురువు రాగానే ఆ మాటలకి అర్థం ఏమిటని వారు అడిగారు.

"మీలో ఎవరికి గులాబి వాసన గురించి తెలుసు?" ప్రశ్నించాడు లావో జు.

శిష్యులంతా తమకి గులాబి వాసన గురించి తెలుసని చెప్పారు.

"ఐతే దాన్ని మాటల్లో పెట్టి చెప్పండి."

శిష్యులంతా నిశ్శబ్ధంగా ఉండిపోయారు. లావో జు మాటలకి అర్థం వాళ్ళకి వెంటనే తెలిసింది.

## 127. అసలు గురువు

ఓ కుటీరంలో ఒంటరిగా జీవించిన మహాత్ముడు ఝుగాన్ ఉదయం నిద్రలేస్తూనే 'ఝుగాన్! ఝుగాన్!' అని పెద్దగా పిలిచేవాడు. వెంటనే ఝుగాన్ తన పిలుపుకి తనే సమాధానం ఇస్తూ, 'చిత్తం గురుదేవా! ఆజ్ఞాపించండి గురుదేవా!' అని ప్రత్యుత్తరం ఇచ్చేవాడు.

'కపటం విడు ఝుగాన్. ఈ రోజు నీ ముందు నువ్వు దోషిగా నిలబడే పనేమీ చేయకు.' అనేవాడు.

'అలాగే గురుదేవా.' అని జవాబు చెప్పేవాడు ఝుగాన్.

'అంతేకాదు మూర్ఖుడా! నువ్వెవరో తెలుసుకోవడమే ఈ జన్మకి నీ కర్తవ్యం అయినప్పుడు, ఇతరుల మీద నీకు దృష్టి దేనికి? దాన్ని నీపైకి మళ్ళించి, నీపై ఓ కన్ను వేసి వుండటమే సాధన అవుతుంది.' గట్టిగా చెప్పేవాడు.

వెంటనే 'చిత్తం గురుదేవా' అని జవాబు చెప్పేవాడు.

ఈ ఏకపాత్రాభినయాన్ని ఝుగాన్ తను బ్రతికివున్నంతకాలం చేసాడు. ఇది విన్న ఎవరు ఎందుకిలా అని అడిగినా ఝుగాన్ చెప్పే జవాబు ఒక్కటే.